క్లుప్తంగా

అంబేడ్కర్ కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాల ఏర్పాటు

రాజాం : స్థానిక బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ కూడలిలో సీసీ కెమెరాలు బుధవారం ఏర్పాటు చేసారు. నేర నియంత్రణలో భాగంగా కూడలి వద్ద ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసామని, అటు శ్రీకాకుళం, ఇటు పాలకొండ, మరోవైపు బొబ్బిలి, చీపురుపల్లి రోడ్లలో ప్రయాణించే వాహనాలు వివరాలు ఈ కెమెరాల ద్వారా తెలుస్తాయని సీఐ అశోక్‌కుమార్ వెల్లడించారు. పండగ సమయంలో ఈ కెమెరాలు బాగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

వరుస పద్ధతిలో రాగుల సాగు మేలు



రాగుల పంటను పరిశీలిస్తున్న ఏఓ

తెర్లాం: రబీ సీజన్‌లో రాగుల పంటను సాగు చేసే రైతులు వరుసల పద్ధతిలో నాట్లు వేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసే రాగుల పంటను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే రాగుల పంటకు సంబంధించి దమ్ము చేసిన పొలంలో నాట్లును వరుసల పద్ధతిలో వేయడం ద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి ఏపుగా పెరగడం, కలుపుతీతకు, చీడపీడల నివారణకు అనుకూలంగా ఉంటుందన్నారు. పంట మంచి దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు రాగుల పంటను సాగు చేసేందుకు ముందుకు వస్తే వరుసల పద్ధతిని అనుచరించడం ఎంతో మంచిదని చెప్పారు.

గొర్లె శ్రీరాములనాయుడుకు నివాళి



గొర్లె శ్రీరాములనాయుడు చిత్రపటం వద్ద నివాళులు

రాజాం : కాపు సామాజిక నేత గొర్లె శ్రీరాములనాయుడు వర్ధంతి రాజాంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజాం ప్రాంతీయ తూర్పుకాపు సంక్షేమ సంఘ నాయకుడు పాలవలస శ్రీనివాసరావు, ఆర్‌వీజే నాయుడు, డాక్టర్ కరణం హరిబాబు, పొట్నూరు సోమశేఖర్, మీసాల వెంకటేష్, రౌతు గణపతిరావునాయుడు, శాసపు వేణుగోపాలనాయుడు, ఈసర్ల మురళీకృష్ణ, బెవర శ్రీనివాసరావు, డోల వాసుదేవరావు, అప్పలనాయుడు, శాసపు సత్యనారాయణ, శాసపు శ్రీను, శంకర్, వల్లేరు సన్యాశినాయుడు, నట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పొన్నాకుల హారతి



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పొన్నాకుల హారతి

బొబ్బిలి: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ ప్రకారంగా వచ్చే పొన్నాకుల హారతిని సమర్పించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులంతా పొన్నాకుల హారతితో ఆధ్యాత్మికానందం పొందారు. హాజరయిన భక్తులకు ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

పీఎం సభకు డ్వాక్రా మహిళల తరలింపు

బాడంగి: విశాఖపట్నంలో బుధవారం జరిగిన ప్రధానమంత్రి మోదీ సభకు బాడంగి మండలం నుంచి డ్వాక్రా సంఘాల మహిళలను బస్సుల్లో తరలించారు. వెలుగు శాఖకు సంబంధించి వీఓల ద్వారా మహిళలను తరలించారు. వారికి వెళ్లడం ఇష్టం లేకున్నా.. నయానో.. భయానో... బస్సులను ఎక్కించారు. ఇదిలా ఉండగా పీఎం విశాఖ రాకతో ఉపాధి పనులు, పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు.

- వేలాది మందికి సేవలందించిన పాగిరి లెప్రసీ ఆస్పత్రి
- 1962 నుంచి ఎనలేని సేవలు
- అప్పట్లో వందలాది మంది రోగులకు సత్రంగా రక్షణ
- ఇప్పుడు కూడా మెరుగైన సేవలందించే ఆస్పత్రిగా పేరు

62 వసంతాలు..
అలుపెరగని సేవలు



పాగిరి లెప్రసీ ఆస్పత్రి



ఆస్పత్రిలో టీవీ చూస్తున్న రోగులు



ఆస్పత్రి ఆవరణలో పనుల్లో వ్యాధి పీడితులు



ఆస్పత్రి ఆవరణలో రోగులు పండించిన కంది పంట

రాజాం : పాగిరి లెప్రసీ ఆస్పత్రి... ఈ పేరు ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తెలియని వారుండరు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో విశాఖపట్నం పరిధిలో కేవలం మూడు చోట్ల మాత్రమే లెప్రసీ నిర్మూలన ఆస్పత్రులు ఉండేవి. అందులో పాగిరిలో ఒకటి నిర్మించి, చిన్న షెడ్డులో తొలుత సేవలు ప్రారంభించారు. ప్రారంభంలో లెప్రసీ వ్యాధిగ్రస్తులను అంటరానివారిగా చూడడంతో పాటు ఆ వ్యాధిని అంటువ్యాధిగా పేర్కొనడంతో ఎవరూ కూడా ఆస్పత్రికి వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. అనతి కాలంలోనే కుష్టు వ్యాధిపై అపోహలు తొలగడంతో పాగిరిలో లెప్రసీ నిర్మూలన మిషన్ సేవలు ఊపందుకున్నాయి. దీంతో 1962లో నాలుగు భవనాలతో లెప్రసీ ఆస్పత్రి రూపుదిద్దుకుంది. నాటి నుంచి నేటి వరకు ఎనలేని సేవలు అందిస్తూ వస్తుంది.

బాగా చూసుకుంటారు..

మేం చిన్నచిన్న కుష్టు వ్యాధి లక్షణాలతో ఇక్కడ చేరాం. ప్రస్తుతం వ్యాధి తగ్గుముఖంగా ఉంది. ఇంటి వద్ద కుటుంబ సభ్యులు వచ్చేయమని అన్నారు. కానీ మరికొద్ది రోజులు ఉండి వెళ్లాలని అనుకుంటున్నాను. ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయి. మంచి వాతావరణం ఉంది. భోజనాలు మాత్రం ప్రభుత్వం పెట్టడం లేదు. జీఎంఆర్ ఆర్థిక సాయంతో భోజనాలు అందిస్తున్నారు.

– జి.రాము, కుష్టువ్యాధి బాధితుడు, పాగిరి లెప్రసీ ఆస్పత్రి

వందల నుంచి పదులకు..

ఆస్పత్రి ఆరంభంలో ఇక్కడ వందల్లో రోగులు ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 21 మంది రోగులు మాత్రమే ఉన్నారు. వీరిలో చాలా మందికి మూడు నెలల్లో వ్యాధి లక్షణాలు తగ్గుముఖంగా ఉండడంతో ఇంటిముఖం పడుతుంటారు. దీర్ఘకాలిక కుష్టు వ్యాధి ఉన్న వారు మాత్రం తమ ఇళ్ల వద్ద కొన్నాళ్లు, ఇక్కడ కొన్నాళ్లు గడుపుతున్నారు. గతంలో ఉన్న నాలుగు భవనాల్లో ఒక భవనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. రెండు భవనాల్లో ఒక గదిలో రోగులు ఉండేందుకు బెడ్‌లు, టీవీలు, మందులు ఏర్పాటు చేసారు. ఇంకో గదిలో వైద్య సేవలు నిమిత్తం వైద్యులకు గదిని కేటాయించారు. మరో గదిలో వ్యాధిగ్రస్తులకు అవసరమైన చెప్పులు, దుస్తులు కుట్టేందుకు కేటాయించారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వ్యాధి తగ్గుముఖం పట్టడంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే రోగుల సంఖ్య కూడా తక్కువగానే ఉందని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కృష్ణమోహన్ తెలిపారు.

అవే భవనాలు..

1962లో ఇక్కడ ఆస్పత్రి ప్రారంభంలో నిర్మించిన పక్కా భవనాలే ఇప్పటికీ ఉన్నాయి. అప్పట్లో పెంకులతో ఈ షెడ్డులు నిర్మించారు. అవి చాలా గట్టివి కావడంతో ఇప్పటికీ అలానే ఉన్నాయి. ఈ గదుల కిటికీలు, తలుపులు మాత్రం చెదలు పట్టి పాడయ్యాయి. కొత్తగా ఇక్కడ భవనాలు అవసరమున్నప్పటికీ రోగుల సంఖ్య తగ్గడంతో పెద్దగా దృష్టి సారించలేదు.



లెప్రసీ ఆస్పత్రి ప్రారంభంలో భాగంగా 1962లో వేసిన శిలాఫలకం

పంట పనుల్లో రోగులు

పాగిరి లెప్రసీ ఆస్పత్రికి వచ్చే రోగులు ఇక్కడ ఉన్నంత కాలం పగటి సమయాల్లో పెరటి తోట పనులు చేస్తుంటారు. విశాలమైన ఆస్పత్రి ఆవరణలో కంది, అరటి మొక్కలను పెంచడం, పలు రకాల కూర జాతులు మొక్కలు వేయడం, మామిడి, సపోట, ఉసిరి చెట్లను పెంచడం చేస్తున్నారు. వీటి ఫలసాయాన్ని కూడా వీరే ఆరగిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆస్పత్రి ప్రారంభించి 62 ఏళ్లు పూర్తవుతున్నా.. ఇంతవరకూ కోవిడ్ సమయంలో కూడా ఈ ఆస్పత్రి మూత పడలేదని ఆస్పత్రి డాక్టర్ వెల్లడించారు. ప్రస్తుతం కుష్టు వ్యాధి ప్రభావం ఎక్కడా లేకపోవడంతో ఇక్కడ రోగుల సంఖ్య తగ్గిందని వైద్యులు చెప్పారు.

మంచి మందులు ఉన్నాయి..

మాది తెర్లాం దగ్గర్లోని గ్రామం. ఇక్కడ ఆస్పత్రిలో మంచి మందులు ఇస్తున్నారని తెలిసి వచ్చి చేరాను. రెండు నెలల్లో వ్యాధి లక్షణాలు మందగించాయి. ఇక్కడ తోట పని ప్రతీ రోజు చేస్తుంటాం. బెడ్‌లు, టీవీలు ఉండడంతో ఇతరాత్ర ఇబ్బందులు ఏమీ రావు.

– ఎల్.మల్లేష్, కుష్టు వ్యాధి బాధితుడు, పాగిరి లెప్రసీ ఆస్పత్రి

చురుగ్గా అప్పలంపేట - వంతరాం రోడ్డు పనులు



అప్పలంపేట - వంతరాం బీటీ రోడ్డు పనులు

తెర్లాం: మండలంలోని అప్పలంపేట నుంచి వంతరాం జంక్షన్ వరకు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అప్పలంపేట నుంచి వంతరాం జంక్షన్ వరకు సుమారు 1.55 కిలోమీటర్ల మేరకు ఈ రోడ్డు నిర్మించేందుకు పీఆర్ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. అప్పలంపేట గ్రామం నుంచి కొంతమేరకు సిమెంటు రోడ్డు నిర్మించి, అక్కడ నుంచి తారురోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పీఆర్ ప్రాజెక్స్ ఏఈ రుగ్మతనాయుడు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అప్పలంపేట నుంచి వంతరాం వరకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో బొబ్బిలి ఎమ్మెల్యేగా ఉన్న శంబంగి వెంకట చినఅప్పలనాయుడు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు గ్రామ సర్పంచ్ ప్రతినిధి గురవాన సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

ఫార్మా మోడల్ ద్వారా కూరగాయల సాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

రేగిడి : మండలంలోని ఉంగరాడ యూనిట్ గుళ్లపాడు క్లస్టర్ పరిధిలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంశక్తి సంఘం సభ్యులకు సంబంధించిన పది సెంట్ల భూమిలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులు ఫార్మా మోడల్ ద్వారా కూరగాయలను సాగు చేసేందుకు ముందుకొచ్చారు. బుధవారం ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణల ఆధ్వర్యంలో కూరగాయలు సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. 365 రోజులూ ఆకు కూరలు, తీగజాతి, మొక్క జాతి కూరగాయలను నిరంతరాయంగా పండించుకోవచ్చన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా ఈ పంటలను సాగు చేసుకుంటే రైతులకు నిత్యం రాబడి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సురేష్, రవి, గోవింద్, అప్పలనాయుడు, సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

బాలికల వికాసానికి సహకరించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ రాజ్యలక్ష్మి

బాడంగి: కిశోరి బాలికల వికాసానికి అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సహకరించాలని సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాస్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల విద్య, బాల్య వివాహాల నిరోధం, చదువు మధ్యలో మానేయడం వంటివి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సఖి గ్రూపుల ద్వారా వారిలో చైతన్యం పెంచాలని, పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు, పోషణ, స్వయంశక్తి, యోగా వంటి అంశాలతో నిత్య జీవితంలో నైపుణ్యాలను సాధించేందుకు కృషి జరగాలన్నారు. ఎంఈఓలు లక్ష్మణదొర, రాజ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ఎబినైజర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగమణి, గౌరమ్మ, శ్రీదేవి, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరామర్శ



రాంప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం : పట్టణంలో కొండంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సలాది తులసీరావు మాస్టారును పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల ఆయన సోదరుడు కుమారుడైన రాంప్రసాద్ మృతి చెందగా, గ్రామానికి చేరుకుని రాంప్రసాద్ మృతిపై ఆరా తీసారు. ఆయన కుటుంబీకులకు తన సానుభూతి తెలిపారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన గుడివాడ ఉత్తరకుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఉత్తరకుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు ఉత్తరకుమార్ కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వెంపల లక్ష్మణరావు, సలాది సతీష్, ముద్దన సత్యారావు, ఎం.వెంకట్, డాక్టర్ బి.నరేంద్ర, సలాది మహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పట్టణ వాసులకు పండగ విజ్ఞప్తి



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

రాజాం సిటీ : పట్టణాల్లో నివసించే ప్రజలు పండగ సమయంలో తమ గ్రామాలకు వెళ్లినా, అత్యవసర పరిస్థితుల్లో వేరే ప్రాంతాలకు వెళ్లినా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, బంధువులకు సమాచారం ఇవ్వాలని రాజాం పట్టణ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. రాజాం పట్టణంలో ఆటోతో మైక్ ప్రచారం బుధవారం నిర్వహించారు. పండగ సమయాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఇంటికి తాళాలు జాగ్రత్తగా వేయాలని, ఆభరణాలు, వస్తువులు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. ప్రయాణ సమయాల్లో కూడా తమ వస్తువులు జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. పట్టణంలో స్థానికంగా ఉంటున్న తమ బంధువులకు కూడా సమాచారం ఇవ్వాలని వెల్లడించారు.

రోడ్ల మరమ్మతుల అవినీతిపై చర్యలకు డిమాండ్



అరకొర మరమ్మతులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి: పట్టణంలోని మున్సిపల్ రోడ్ల మరమ్మతులకు రూ.50లక్షలు వెచ్చించారనీ, ఫ్లైఓవర్‌పై నాసిరకం రంగుల బొమ్మలు వేయడానికి రూ.18లక్షలు, డివైడర్లపై రంగుల కోసం రూ.10లక్షలు వ్యయం చేస్తున్నారని ఈ పనుల్లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయా పనులను పరిశీలించి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గుంతల రోడ్లను కప్పేందుకు ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను వేసి మరింత ప్రమాదకరంగా మార్చారన్నారు. బుగ్గి వేసి నిధులు గల్లంతు చేశారన్నారు. అలాగే ఫ్లైఓవర్‌పై నాసిరకం వాటర్ పెయింట్లు వేసి లక్షలాది రూపాయలను స్వాహా చేస్తున్నారన్నారు. డివైడర్లకు కూడా లక్షలాది రూపాయల రంగులు అద్ది సొమ్ము స్వాహా చేయడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ ఆర్డీ తదితరులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలనీ, లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండలాధ్యక్షుడు ఎస్.గోపాలం, సురేష్, పరశురాం తదితరులున్నారు.

● చేనుకు.. చీర కాపలా..



రాజాం మండలంలోని రైతులు రబీలో మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పూత దశలో కండెలతో కలకలలాడుతున్నాయి. పలుచోట్ల ఈ పంటల్లో అడవి పందులు, నక్కలు చొరబడి పంటను నాశనం చేస్తున్నాయి. వీటి బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు పంటలకు కంచెగా పాత చీరలు కడుతూ రక్షించుకుంటున్నారు. మండలంలో కొఠారిపురం, లక్ష్మీపురం, కంచరాం, నందబలగ ప్రాంతాల్లో ఈ చీర కంచెలు ఇలా దర్శనమిస్తున్నాయి. – రాజాం

ముగిసిన రెవెన్యూ సదస్సులు



గడిముడిదాం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ తదితరులు

రాజాం : మండలంలోని గ్రామాల వారీగా నిర్వహించిన రైతు రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిసాయని తహసీల్దార్ ఎస్‌కే రాజు వెల్లడించారు. గడిముడిదాం గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించి, అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుల ద్వారా వస్తున్న ఫిర్యాదుల్లో సగానికి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం 150కి పైగా ఫిర్యాదులు వచ్చాయని, 80 సమస్యలు పరిష్కరించామని వెల్లడించారు. సాంకేతిక సమస్యలున్న చోట ఇబ్బందులు ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ రాజశేఖర్, ఆర్ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడిలో..

రేగిడి : మండలంలో రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిసాయి. చివరిరోజున లక్ష్మీపురం, చాటాయివలస గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ చిన్నారావు దృష్టికి ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు తీసుకొచ్చారు. పాసుపుస్తకాలు, రీ సర్వే, మ్యుటేషన్ తదితర సమస్యలను పరిష్కరించాలని రైతులు వినతిపత్రాలు అందించారు. సర్పంచ్ కెంబూరు తేజోవతి, కరణం గోవిందరావు, వీఆర్‌లు దుర్గారావు, దొర, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



రేగిడి : వన్నలిలో రోడ్లను పరిశుభ్రం చేయిస్తున్న సర్పంచ్ గార రమణ, పంచాయతీ కార్యదర్శి



వంగర : కొప్పరవలస గ్రామంలో పారిశుద్ధ్య పనులు

రేగిడి : సంక్రాంతి పండగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్నవారంతా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య పనులను గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చేపట్టారు. కాలువల్లో పూడికలు తీయించడం, రోడ్లను పరిశుభ్రం చేయించడం వంటి పనులను చేపట్టారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను ఆరుబయటకు తరలిస్తున్నారు. వన్నలి, అంబకండి, ఉనుకూరు, చిన్నశిర్లాం, బూరాడ తదితర గ్రామాల్లో బుధవారం కాలువల్లో పూడికలు తీయించే కార్యక్రమాలు చేపట్టారు.

కొప్పరవలసలో..

వంగర : మండలంలోని కొప్పరవలస గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ సాదెం లలితకుమారి ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి. అన్ని వీధుల్లో మురుగు కాలువల్లో నీటిని తొలగించి, బ్లీచింగ్ వేసారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దీప్తి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గెంబలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఎదురు చూపులే!

- డివిజన్‌లో 1650 దరఖాస్తుల స్వీకరణ
- ఓపెన్ కాని వెబ్‌ల్యాండ్
- పరిష్కరించినవి 550



ఇతని పేరు జి.వేణుగోపాల్. ఈయనది గోపాలరాయుడిపేట గ్రామం. బొబ్బిలి మండలంలో మూడు నెలల క్రితం జరిగిన సదస్సులో తన పొలం మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పరిష్కారం కాలేదు. ఇప్పుడు మళ్లీ రెవెన్యూ సదస్సు నిర్వహించగా మరోసారి దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఫలితం లేదు. కారణం ఏంటంటే వెబ్‌ల్యాండు కూడా ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతున్నారని వాపోయాడు.

బొబ్బిలి: జరగని పెళ్లికి బ్యాండు బాజాలెందుకన్న తీరుగా ఉంది రెవెన్యూ సదస్సుల తీరు! రైతులు, ప్రజలకు సంబంధించిన సాగు భూములు, వివిధ స్థలాల రికార్డుల నమోదు, ఆన్‌లైన్ చేయడం వంటి సమస్యలతో పాటు మ్యుటేషన్‌ల కోసం సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పిన కూటమి ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితవుతోంది. డివిజన్‌లో ఏడు మండలాలు ఉండగా 273 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ డివిజన్లో బుధవారం వరకూ నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆర్డీఓ, తహసీల్దార్‌లు స్వయంగా గ్రామాలకు వెళ్లి 1650 అర్జీలు స్వీకరించారు. కానీ వాటిలో పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్న యంత్రాంగం కనీసం 50శాతం కూడా పరిష్కరించలేదు. బొబ్బిలిలో 226, బాడంగి 56, దత్తిరాజేరు266, గజపతినగరం163, మెంటాడ444, రామభద్రపురం202, తెర్లాంలో 293 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించినప్పుడు పూర్తి స్థాయిలో కాలపరిమితి లేకుండా దరఖాస్తులు పరిష్కరించాలి. వాటిని కూడా పూర్తి స్థాయిలో పరిష్కరించకుండా కేవలం 553 మాత్రమే పరిష్కరించామని చెబుతున్నారు. కానీ అందులోనూ సమస్యలున్నాయని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రీసర్వేపై గ్రామ సదస్సులు నిర్వహించింది. ఈ సదస్సుల్లో దాదాపు 1700 దరఖాస్తులు వచ్చినా పరిష్కారం కాలేదు. ఇప్పుడు మళ్లీ 1650 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిస్థితి కూడా అలానే ఉందని ప్రజలు, రైతులు పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.శ్రీనును వివరణ కోరగా వెబ్‌ల్యాండ్ ఓపెన్ కావడం లేదన్నారు. త్వరలోనే ఉన్నతాధికారులు సమస్య పరిష్కరిస్తారని తెలిపారు.



పాత బొబ్బిలి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ జేవీవీఎస్ రామమోహనరావు, తహసీల్దార్ ఎం.శ్రీను తదితరులు